
# వలస పక్షులు

-గన్నవరపు నరసింహమూర్తి

"రేపట్నుంచి కొల్లేట్లో చేపల చెరువుల్ని ధ్వంసం చేస్తారుట" అన్న వార్త దావానలంలా ఆ ప్రాంతమంతా వ్యాపించింది. ఎక్కడ విన్నా, ఎవరు మాట్లాడుకున్నా అవే వార్తలు. సింహాచలానికి ఆ వార్త వినగానే ఏం చేయాలో తోచడంలేదు. తాను కుటుంబంతోసహా ఈ ప్రాంతం వలసొచ్చి ఐదేళ్లకి పైగా అవుతోంది. అప్పట్నుంచీ ఇవే కబుర్లు. ఎందుకో ఈసారి ఇది నిజమనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది కాబట్టి ఈసారి చెరువుల ధ్వంసం తప్పదని అంటున్నారు అందరూ. అదే నిజమైతే తామెంతా ఏమైపోవాలి? ఉదయం నుంచీ సింహాచలానికి ఇదే ప్రశ్న మెదడును దొలిచేస్తోంది.

కట్టుబట్టలతో తిండిలేక ఎక్కడో విజయనగరం ప్రాంతంనుంచి సింహాచలం కుటుంబంతోసహా ఈ కొల్లేటి ప్రాంతానికి వలస వచ్చాడు. అప్పటికి ఐదేళ్ల నుంచీ ఆ ప్రాంతమంతా కరువుతో విలవిలలాడుతోంది. సింహాచలంది పెద్ద కుటుంబం. సింహాచలం ఐదుగురు అన్నదమ్ముల్లో మూడోవాడు. అందరికీ పెళ్లిళ్లయిపోయి పిల్లలు కూడా. ముగ్గురు అక్కలకి పెళ్లిళ్లయి ఏలూరు ప్రాంతానికి వలస వెళ్లిపోయారు.



తల్లిదండ్రులిద్దరూ స్వంత ఊరిలో ఒంటరిగా ఉంటున్నారు. సింహాచలం తండ్రి అప్పన్నదొరకి పూర్వీకుల ఆస్తి ఏమీలేదు. మొదట్నుంచీ ఆ ఊరి సర్పంచ్ దగ్గర పాలేరుగా పనిచేయడం, అతని పొలాన్ని శిస్తుకి చేయడం, ఆ వచ్చిన ఆదాయంతో ఈ పెద్ద కుటుంబాన్ని పోషించడం చేసేవాడు.

అతనేం చదువుకోలేదు. అందుకని అతనికి కుటుంబ నియంత్రణ అంటే అస్సలు తెలియదు. దాని గురించి చెప్పే వాళ్లు కూడా లేరు. పైగా ఎక్కువమంది పిల్లలుంటే కూలి పనికి వెళ్లి ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని అతని ఆలోచన. మధ్యాహ్న భోజన పథకం పుణ్యమా అని అతని కొడుకులందరూ పదవ తరగతిదాకా చదువుకున్నారు. అందులో సింహాచలం టెంత్ క్లాస్ పాసయ్యాడు కూడా. తరువాత పై చదువులు చదవడానికి డబ్బుల్లేక కూలి పనులకు వెళ్లడం మొదలుపెట్టాడు. కానీ వరుసగా ఆ ప్రాంతం కరువుబారిన పడడంతో కూలీ పని కూడా దొరకడం గగనమైపోయింది. ఎక్కడ చూసినా బీటలు వారిన పొలాలు, ఎండిపోయిన చెరువులు. సింహాచలానికి ఇద్దరు పిల్లలు. తండ్రి నుండి విడిపోయి అప్పుడే రెండేళ్లు అవుతోంది. ఏం చేయాలో తోచని స్థితిలో ఉండగా అతని అక్కలు సంక్రాంతి పండక్కి ఆ ఊరు వచ్చారు. తమ్ముడి పరిస్థితి చూసి కొల్లేటి ప్రాంతానికి వచ్చేయమన్నారు. అక్కడయితే చేపల చెరువులు విపరీతంగా ఉన్నాయనీ, బోలెడంత పనసీ, బ్రతుకు హాయిగా గడిచిపోతుందనీ చెప్పడంతో పండుగ తరువాత కుటుంబంతోసహా ఈ కొల్లేరు ప్రాంతానికి వచ్చేసింది సింహాచలం కుటుంబం.

వాళ్ల అక్కలు చెప్పిన మాట నిజమయింది. అక్కడో పెద్ద రాజకీయ నాయకుడి దగ్గర పనికి కుదిరాడు సింహాచలం. ఆ నాయకుడు ఎప్పుడూ హైదరాబాద్‌లో వుంటాడు. అతనికి నూరుకి పైగా చేపల చెరువులున్నాయి. సింహాచలానికి వాటి మధ్యలోనే ఇల్లు కట్టించాడు ఆ యజమాని.

సింహాచలం, అతని భార్య సీతాలుకి ముప్పొద్దులా ఆ చెరువుల్ని జాగ్రత్తగా చూసుకోవడమే పని. యజమాని అప్పుడప్పుడు వస్తుంటాడు. అతను ఉండడానికి రాజభవనంలాటి గెస్ట్‌హౌస్ ఉంది. చేతినిండా పని దొరకడంతో సింహాచలానికి ఎంతో ఆనందమేసింది. డబ్బు కూడా బాగా ముడుతుండడంతో ఆ కుటుంబం కడుపునిండా ఇంత అన్నం తింటోంది.కొద్దిగా డబ్బు కూడా వెనకేసుకున్నాడు సింహాచలం.


ప్రతి సంక్రాంతికి తన ఊరికి కుటుంబంతో కలసి వెళ్లేవాడు సింహాచలం. తల్లిదండ్రులకు బట్టలు తీసుకెళ్లేవాడు. వచ్చేముందు వాళ్లకు

డబ్బులు కూడా ఇచ్చేవాడు. సంవత్సరానికి ఒకసారి వచ్చే సింహాచలం అంటే ఆ ఊరివాళ్లకెంతో గౌరవం ఇప్పుడు. సింహాచలానికి ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఇదివరకటిలా డబ్బు దరిద్రంలేదు. చేతినిండా పని, డబ్బులు. అందుకని తమకు కూడా పని చూపించమనీ, తనతో తీసుకెళ్లమనీ ఆ ఊరి వాళ్లు చాలామంది అడుగుతుండడంతో తనతోపాటు చాలామందిని కొల్లేటి ప్రాంతానికి తీసుకువచ్చాడు సింహాచలం. వాళ్లనందరినీ ఆ ప్రాంతంలోని చేపల చెరువుల్లో పనికి కుదిర్చాడు. ఇప్పుడు సింహాచలం వాళ్లందరి దృష్టిలో చిన్నసైజు నాయకుడు.

జీవితం సాఫీగా సాగుతున్న సమయంలో మళ్లీ ఈ సమస్య ముందుకొచ్చింది. ఇప్పుడేం జరగబోతోంది? తనేం చేయాలి? సింహాచలాన్ని ఈ ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది.

★★★

ఆ మర్నాడు జిల్లా అధికారులు ఆ కొల్లేరు ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో చాటింపు వేసారు, తమ ఆధీనంలో వున్న అన్ని చేపల చెరువుల్ని స్వచ్ఛందంగా తామే ధ్వంసం చేయాలనీ, వాటిని తక్షణం  ఖాళీ చేయాలనీ, లేకపోతే



ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందనీ దాని సారాంశం. ఒకప్పుడు అది అందమైన, స్వచ్ఛమైన నీటి సరస్సు. సముద్రాన్ని తలపించేటట్లు ఉండే ఆ అందమైన కల్హారానికి అందమైన పచ్చటి చెట్లు, ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా నింగిలో విహరించే విహంగాలు... ఇవే ఆభరణాలు, కనుచూపు మేరలో నీరు తప్ప ఏమీ కనిపించేదికాదు. మధ్యమధ్యలో అక్కడక్కడ చిన్న చిన్న పల్లెలు. చేపల వేటే అక్కడి ప్రజల జీవనాధారం. కానీ కొన్ని సంవత్సరాలుగా ఆ సరస్సుని పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, బడా కాంట్రాక్టర్లు, చివరకు మాఫియా లీడర్లు ఆక్రమించడం మొదలుపెట్టారు. ఆ సరస్సు మొత్తాన్ని చేపల చెరువులుగా మార్చేసారు. కొద్దిరోజుల్లోనే ఆ మంచినీటి సరస్సు కాస్తా మురికినీటి సరస్సుగా తయారైంది. వర్షాకాలంలో కాలువలు, డ్రైన్లు మూసుకుపోవడంతో ఆ చుట్టుప్రక్కల గ్రామాలకు వరదనీరు రావడం మొదలైంది. ఎన్నో వేల మైళ్ల నుంచి వచ్చే వలస పక్షులు క్రమేపీ రావడం మానేసాయి. ఆ సమయంలో ఒక స్వచ్ఛంద సంస్థ వేసిన వాజ్యం కారణంగా సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని చేపల చెరువులు అన్నింటినీ ధ్వంసం చేయాలని తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

★★★

ఆ మర్నాటి నుంచి సింహాచలం కుటుంబానికి ప్రారంభమయ్యాయి సమస్యలు. ఎక్కడ చూసినా పోలీసులే. వాళ్లు ప్రొక్లెయినర్స్ సాయంతో చేపల చెరువుల్ని ధ్వంసం చేయడం మొదలెట్టారు. సింహాచలం కుటుంబాన్ని బలవంతంగా ఆ ఇంటి నుంచి ఖాళీ చేయించి ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంపుల్లో పడేసారు. రెండురోజులుగా సరైన భోజనం లేదు, పిల్లలికి ద్దరికీ జ్వరాలు. ఓప్రక్క తమ చేపల చెరువుల్లో కొన్ని లక్షల రూపాయల రొయ్యలు, వాటిని రక్షించకపోతే యజమానికి కోపం వస్తుంది. అక్కడకు వెళ్తే పోలీసుల లాఠీ దెబ్బలు. ఆ సమయంలో తమ యజమాని వచ్చాడని తెలిసీ ఆయన్ని కలిసాడు సింహాచలం. చెరువుల్ని వదిలి వచ్చినందుకు కోప్పడ్డాడు ఆ యజమాని. అతనికి జీతం ఇవ్వనన్నాడు. విషయం అంతా చెబితే అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. మొత్తం అక్కడ పని చేసిన వాళ్లనందరినీ చెరువుల్ని ధ్వంసం చేయకుండా ప్రొక్లైనర్స్‌కి అడ్డుపడమన్నాడు. విధిలేక ఆ పని చేసి పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారు సింహాచలం, అతని భార్య.

ఆ సాయంత్రం క్యాంపులో కూర్చుని సింహాచలం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఏ దారీ కనబడడంలేదు. సాఫీగా సాగుతున్న తమ జీవితాలలో ఎందుకో ఈ కలకలం? పేదవాళ్ల బ్రతుకింతే కాబోలు! పోనీ తన గ్రామానికి తిరిగి వెళ్లిపోతే... ఈ

ఆలోచన చుట్టే అతని మనస్సు పరిభ్రమిస్తోంది. కానీ అక్కడ కరువు విలయ తాండవం చేస్తోంది. అందుకే క్రితం సంవత్సరం తన ఆఖరి తమ్ముడు పకీరు ఎవరో మధ్యవర్తిని పట్టుకుని ఇరాక్‌కి కుటుంబంతోసహా వెళ్లిపోయాడు. ఊళ్లో తల్లీదండ్రీ ఉంటున్నారు.

వాళ్లు తాము పంపిన డబ్బుతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటికెళ్తే ఏం చేయాలి? ఈ సమస్య తనదేకాదు, వేలాదిమంది వలస కూలీ లందరిదీని.

***

సుప్రీంకోర్టు తీర్పువల్ల ఏ రాజకీయ నాయకుడు సహాయం చేసే స్థితిలో లేడు. అదీగాక వాళ్లు తమందర్నీ ఎరగా వాడుకుందామని చూస్తున్నారు.

మర్నాడు వలస కూలీలు మొత్తం అందరూ కలెక్టర్‌గారు వస్తే కలిసారు. తమ గోడు చెప్పుకుని ఏదో దారి చూపించమని అడిగారు. కలెక్టర్‌గారు "ముందు మీరంతా ఖాళీ చేసి ప్రభుత్వానికి సహాయం చేయండి. అందరినీ ప్రభుత్వం ఆదుకుని పని చూపిస్తుందని'' చెప్పడంతో ఇంక ఖాళీ చేయక తప్పలేదు. కబ్జా చేసిన యజమానులందరూ తోక ముడిచి ఖాళీ చేసి వెళ్లిపోయారు. సింహాచలానికి ఆందోళన ఎక్కువైంది తమను గురించి ఆలోచించే నాథుడే కరువయ్యారు అని. ఆ వలస కూలీలందరూ భయాందోళనలతో కాలం గడుపుతున్నారు.

వారంరోజుల తరువాత చాలా చేపల చెరువులు ధ్వంసం కావడంతో ప్రభుత్వం పునరావాస కేంపుల్ని ఎత్తివేసింది. ఈ వలస కూలీలకు భోజన సదుపాయం కూడా కల్పించడం మానేసింది.

సింహాచలం ఇక అందరి గురించి ఆలోచించడం మానేసాడు. అతనో నిర్ణయానికి వచ్చేసాడు. ఇంక కుటుంబంతోసహా స్వంత ఊరికి వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డాడు. మర్నాడే భార్యతో విషయం చెప్పి బయలుదేరడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

***

బండిలో సామానంతావేసి తనూ, భార్య సీతాలు, పిల్లలతో బయలుదేరాడు సింహాచలం. బండి రైల్వేస్టేషన్‌కి బయలుదేరింది. ఇంకో రెండుగంటల్లో రాయఘడ పాసింజర్ ఉంది. దాంట్లో బయలుదేరితే విజయనగరం రాత్రికి చేరుకుంటారు.

అక్కడనుంచి తమ ఊరికి బస్సులో వెళ్లాలి. కొబ్బరిచెట్ల మధ్య నుంచి బండి మెల్లగా సాగిపోతోంది. ఐదేళ్ల నుంచీ ఇక్కడే ఉంటూ ఇప్పుడు ఆ ప్రాంతాన్ని వదిలివెళ్లడం అతనికి చాలా బాధగా ఉంది. ఇన్నాళ్లూ బ్రతుకు బండి హాయిగా సాగిపోయింది.

ఇప్పుడు తన ఊరు ఏ ముఖం పెట్టుకుని వెళ్తాడు? ఎలా బతకాలి? దారి పొడవునా తమ స్వంత ఊళ్లకు తరలివెళ్తున్న వలస కూలీలే కనిపిస్తున్నారు. అందరి ముఖాల్లో విషాదం తొంగి చూస్తోంది. కొల్లేటి ప్రక్షాళన వాళ్లందరి జీవితాల్లో తీరని వేదన మిగిల్చింది. ఆకాశమంతా నిర్మలంగా ఉంది. ఎక్కడో నుంచో వేలవేల పక్షులు గుంపులు గుంపులుగా వస్తున్నాయి. వాటిని చూస్తే సింహాచలానికి ఈర్ష్య వేస్తోంది. అవి తిరిగి తమ స్వంత గూటికి వస్తున్నాయి. కొన్ని పక్షులు సుదూర తీరాల నుంచి వలస వస్తున్నాయి. తామే వెనక్కి వెళ్లిపోతున్నారు.

సింహాచలం మౌనంగా ఉండడం చూసి అతని భార్య సీతాలు అంది "మామా! ఇప్పుడు మనూరెల్లి అక్కడేటి సేత్తాం. అక్కడ పనులు లేకనేకదా ఈడకొచ్చింది. అదీగాక మామా ఈ కొల్లేరు సేపల చెరువుల్లో పని చేసేటోళ్లకి గవర్నమెంట భూములిస్తారటకదా. అది మనకివ్వరా'' అమాయకంగా ఆమె అడిగిన ప్రశ్నలక నిర్వేదంగా సమాధానం చెప్పాడు సింహాచలం.

"అందుకే కదే మొన్నట్నుంచీ ఆ గొడవలు. ఆ భూముల్నిచ్చేది మొదట్నుంచి ఈడనే ఉన్నోళ్లకట. మనలా వలసొచ్చినోళ్లకి కాదు, అందుకే మనల్ని ఇక్కడ్నుంచి పొమ్మంటున్నారు. లేకపోతే గొడవలు పెరిగిపోతాయి''

"అయితే మామా! పోలవరం దగ్గర గోదారి మీద పెద్ద డామ్ కడుతన్నట కదా. ఆడ బోల్డు పని దొరుకుతుందట. ఆడకెళ్తే సరి'' ఉత్సాహంగా అంది సీతాలు. ఆమెకు తమ ఊరుకెళ్లడం సుతరామూ ఇష్టంలేదు. ఆమె ఆనందానికి తూట్లు పొడుస్తూ చెప్పాడు సింహాచలం.

"లేదే! ఆడ కూడా సుప్రీంకోర్టు పనులు ఆపుసెయ్యమంది. అక్కడ కూడా పనులు ఆపేయడంవల్ల వెళ్లిన మనోళ్లందరూ ఈడకే వచ్చేసేరు''

ఆ సమాధానంతో సీతాలులో మునుపున్న ఉత్సాహంలేదు. ఆమె ముఖం చిన్నబోయింది. బండి మెల్లగా వెళ్తోంది.

ఇంతలో "సింహాచలం" అన్న పిలుపుతో వెనక్కి చూసాడు సింహాచలం. పోస్టుమేన్ సైకిల్‌మీద స్పీడుగా వస్తున్నాడు. సింహాచలం బండిని ఆపించాడు.

## క్రేన్ సాయం!

మెక్సికోకి చెందిన యూరిచ్ చిన్నప్పుడు బొద్దుగా ఉండేవాడు. 22వ ఏట అతని బరువు132 కిలోలుండగా 39 సంవత్సరాలు వచ్చేసరికి 550 కిలోల బరువుకు చేరుకున్నాడు. గత ఐదేళ్లుగా అతను పక్క వదిలి గది బయటకు రాలేని పరిస్థితి. అతనికి తినిపించడానికి, పక్క శుభ్రం చేయడానికి బంధువులు నానా తంటాలు పడేవారు. గత ఎనిమిది నెలల్లో నానా అవస్థలు పడి అతను 200 కిలోలు తగ్గేలా చూసారు. ఇప్పటికీ అతను తనం



తట తాను నడవలేడు. ఐదేళ్ల తరువాత ఇంటి బయటకు తీసుకెళ్లినప్పుడు అతన్ని లారీమీద కూర్చోబెట్టడానికి ఓ క్రేన్ కావాల్సి వచ్చింది. క్రిందటి సంవత్సరం సర్జరీ ద్వారా బరువు తగ్గించాలని ఇటలీకి తీసుకువెళదామనుకున్నారట. కానీ ఇటీవల క్రమక్రమంగా అతను బరువు తగ్గుతున్న కారణంగా అది విరమించుకున్నారట!

## కుక్కల నైపుణ్యం

ఇంగ్లండ్‌లో 'చారిటీ కెనైన్ పార్ట్‌నర్స్' అనే సంస్థ లాబ్రడార్ లాంటి కుక్కలకి అనేకరకాల పనులు చేయడంలో మంచి శిక్షణనిస్తోంది. ఇటీవల 30 కుక్కలకి ఎటియంల్లో కార్డులు పెట్టి తీయడం, డబ్బు, రసీదుల్ని పట్టుకురావడంలో ప్రత్యేక్ష శిక్షణ ఇచ్చారట. చక్రాల బండిలో ఉన్న వికలాంగులు నిలబడి ఎటియంలని ఆపరేట్ చేయలేనప్పుడు ఆ కుక్కలు చాకచక్యంగా ఈ సేవల్ని అందిస్తున్నాయిట.

-విమలారామం

"నీకు రెండు ఉత్తరాలు వచ్చాయి సింహాచలం. కేంపుకెళితే రైల్వేస్టేషన్‌కెళ్లి పోయావ్ అన్నారు. అందుకే పరుగు పరుగున వచ్చాను'' అంటూ రెండు కవర్లు ఇచ్చాడు సింహాచలానికి. అతడు ఆ ఉత్తరాలు ఎక్కడనుంచి వచ్చాయో చూసాడు. ఒకటి తమ ఊరి నుండి అయ్య వ్రాసాడు. ఇంకోటి ఇరాక్ నుంచి తమ్ముడు పకీర్ వ్రాసింది. తన తండ్రికి వ్రాయడం చేతకాదు. ఎప్పుడూ తమ స్కూలు మాస్టర్ చేత వ్రాయిస్తూ ఉంటాడు. విప్పి చదవడం మొదలెట్టాడు.

"సింహాచలానికి!

మీ అయ్య దీవించి వ్రాయునది. ఉభయ కుశలోపరి. ఈమధ్యన మీ అమ్మకు ఒంట్లో బాగుండడంలేదు. వైద్యం చేయిద్దామంటే డబ్బుకి ఇబ్బందిగా ఉంది. ఈమధ్యనే పులిమీద పుట్రలా మన ఊరి దగ్గర అణు విద్యుత్ కర్మాగారం ప్రభుత్వం నెలకొల్పుతోంది. అది వస్తే మనందరికీ ప్రమాదమట. పెద్ద పెద్ద జబ్బులు, కేన్సర్‌లు వస్తాయిట. పంటలు కూడా పండవట. పొలాలన్నీ బీడులైపోతాయిట. ఇక్కడ మనూరోళ్లందరూ చాలా భయం భయంగా కాలం గడుపుతున్నారు. రోజూ గొడవలు జరుగుతున్నాయి. మొన్నీ ప్రాంతాన్ని చూడడానికి ముఖ్యమంత్రిగారొచ్చినప్పుడు చేసిన ఆందోళనలో పోలీసు కాల్పులకు మీ చిన్నాన కొడుకు చనిపోయాడు. ఇప్పుడు ఊరంతా పోలీసులే. బయటకెళ్లడానికే భయమేస్తోంది. చాలామంది ఊళ్లు ఖాళీ చేసి పడమరకి వలస వెళ్లిపోతున్నారు. ఇక్కడ ఇంకా కరువు కొనసాగుతోంది. తిండి గింజలు కూడా దొరకడంలేదు. చేద్దామంటే పని దొరకడంలేదు. మీ అమ్మ మంచం పట్టేసింది. నాకూ అప్పుడప్పుడు జ్వరం వస్తోంది. మీ అన్నలు కూడా విశాఖపట్నం వెళ్లిపోదామనుకుంటున్నారు. అక్కడైతే బోలెడు పని దొరుకుతుందిట. మీ తమ్ముడి నుంచి జాబు రాలేదు. అందుకే నేను, మీ అమ్మ నీ దగ్గరకు వచ్చేద్దామనుకుంటున్నాము. మేమేమీ అక్కడ ఖాళీగా కూర్చోములే. ఆ చేపల చెరువుల్లో ఏదో పని మాకు చేతనైంది చేస్తాం. అందరం కలసి కలో గంజో తాగుదాం. మేం రావడానికి పైసలు అవసరం పడతాయి. వెంటనే నువ్వు డబ్బులు పంపిస్తే నేను, మీ అమ్మ ఆడకొచ్చేస్తాం. వెంటనే డబ్బు పంపవలెను. కోడలు సీతాలుని, పిల్లలని అడిగినట్లు చెప్పు.

ఇట్లు మీ అయ్య
అప్పన్న''

ఉత్తరం చదివిన సింహాచలానికి మస్తిష్కం పని చేయడం మానేసింది. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. రెండో ఉత్తరం తమ్ముడు పకీరు వ్రాసినది చదవడం మొదలుపెట్టాడు.

"అన్నయ్యకు,

మీ తమ్ముడు పకీరు వ్రాయునది. మేము ఇరాక్ రావడానికి చాలా ఖర్చయింది. మా మావ దగ్గర అప్పుచేసి ఒక బ్రోకర్ ద్వారా ఇక్కడికొచ్చాము. ఇక్కడ నేను ఒక కంపెనీలో పనికి కుదిరి సంవత్సరం అయింది. ఈలోగా ఒకొత్త బెడద వచ్చిపడింది. ఇక్కడ అమెరికాతో యుద్ధం మొదలైంది తెలుసు కదా? ఆ యుద్ధం పూర్తయినా గొడవలు మాత్రం చల్లారలేదు. అమెరికా సైన్యానికి, ఇరాక్ ప్రజలకు గొడవలు ముదిరి పాకాన పడ్డాయి. అందువల్ల ఇరాక్‌లోని తీవ్రవాదులు మన భారతీయుల్ని ముఖ్యంగా మనలాగా వలస వచ్చిన కూలీలను చంపేస్తున్నారు. రెండునెలల నుంచి ఇక్కడ పనిలోకి నేను వెళ్లడం లేదు. బాగ్దాద్ దగ్గర్లోని చిన్న పల్లెలో తల దాచుకుంటున్నాను. ఇక్కడ మా పని దినదిన గండంగా ఉంది. చేతిలో డబ్బులులేవు. తిండికి కూడా ఇబ్బంది పడుతున్నాము. అందుకే మమ్మల్ని తీసుకొచ్చిన మధ్యవర్తిని కలిసి మమ్మల్ని ఇండియాకు పంపే ఏర్పాటు చేయమని ప్రాధేయపడ్డాము. మొత్తంమీద కష్టపడి ఇండియాకి విమానం టిక్కెట్ సంపాదించాము. మరో పదిహేనురోజుల్లో మన దేశం వచ్చేస్తాను. అప్పుడు అక్కడికి వచ్చినా మన ఊరు వెళ్లి ఏం ప్రయోజనం? అందుకే మేమంతా నువ్వున్న కొల్లేటి ప్రాంతానికి వచ్చేస్తాం. నాకు కూడా ఏదో పని చూడు. అక్కడే పని చేసుకుంటూ నీలాగే బ్రతికేస్తాం. అక్కడ నువ్వు చాలామందికి పనిప్పించావుటకదా? త్వరలోనే వచ్చేస్తాం. వచ్చినప్పుడు అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఉంటాను, నీ తమ్ముడు

పకీరు''

ఆ ఉత్తరాలు చదివిన సింహాచలానికి ఊపిరాడడంలేదు. అతడి కంట నీరు ఉబుకుతోంది. ఆకాశంలో పక్షులు శబ్దం చేస్తూ ఎగురుతున్నాయి. అవి కొల్లేటి వైపు పరుగులు తీస్తున్నాయి. అవన్నీ వలస పక్షులు. ఈ కాలం రాగానే అవి ఎక్కడో దూర ప్రదేశాల నుంచి ఇక్కడికి ఆహారం కోసం వచ్చేస్తాయి తమ లాగే. అవును తాము కూడా వలస పక్షులే. వాటికీ తమకూ ఏమిటి తేడా? కాకపోతే వాటి కోసం ప్రభుత్వాలతోసహా అందరూ ఆలోచిస్తున్నారు. కానీ తమ వంటి పేదవాళ్ల గురించి కోర్టులు కూడా ఆలోచించడంలేదు. అతని మస్కిష్కం పని చేయడంలేదు. ముందున్నవి చీకటి రోజులు. మంచి రోజులు మళ్లీ వస్తాయా? బండి మాత్రం రైల్వేస్టేషన్‌వైపు సాగిపోతోంది.

★

## బ్రిటన్‌లో బానిసత్వం

బ్రతుకు తెరువు కోసం ఉద్యోగాలు దొరుకుతాయన్న ఆశతో బ్రిటన్‌లోని అనధికారికంగా అడుగుపెట్టిన యువతుల్ని ఎయిర్‌పోర్టుల్లోనే పట్టుకుని కొన్ని ముఠాలు ఒక్కొక్కరిని ఆరువేల నుంచి ఎనిమిదివేల పౌండ్లకి వేలం వేస్తున్నారుట. అలా కొనుక్కున్న దళారీలు ఆయువతుల్ని వ్యభిచారంలోకి దింపి రోజుకి ఒక్కొక్కరి ద్వారా 800పౌండ్లు సంపాదిస్తున్నారుట. పోలీసులకి చెబితే వెనక్కి పంపుతారన్న భయంతో ఆదుర్భర జీవితానికి లొంగిపోతున్నారా యువతులు. ఇటీవల బ్రిటిష్ పోలీసువ్యవస్థ స్కాట్లండ్, యార్డ్ పరిశోధనలో ఈ కఠినసత్యం వెల్లడైంది. క్రీస్తు పూర్వం 1780 నుంచి హమ్మురాబి అనే బానిసవ్యవస్థ ఉండేదని ఇప్పటికీ అది ఏదోరూపంలో కొనసాగుతూనే ఉందని నిపుణులు అంటున్నారు.

## టండ్రాలలో చెట్లు

ఆర్కిటిక్ దగ్గర అంతటా మంచుమయమని అందరికీ తెలుసు. గతంలో టండ్రాలలో ఎక్కడో కాస్తంత గడ్డి, తుప్పలు లాంటివి మాత్రమే ఉండేవిట. కానీ గ్లోబల్ వార్మింగ్ వల్ల వాతావరణంలో విపరీతమైన మార్పులు వచ్చి గత 300 సంవత్సరాలలో ఎప్పుడూ ఎవరూ ఎరుగని చెట్లు ఇప్పుడక్కడ పెరుగుతున్నాయిట. చెట్లు పెరుగుతున్నందుకు ఒక వైపు శాస్త్రజ్ఞులకి ఆనందంగానే ఉన్నా మంచుప్రాంతపు జీవులు చాలా అంతరించిపోయే ప్రమాదముందని భయపడుతున్నారు.

## మూర్ఖపు పెళ్లివారు

ఈమధ్య సంత్ నగర్‌లో ఒక పెళ్లి పందిట్లోకి బారాతీలు అడుగుపెడుతుండగా వంట వాసనలకి ఓ ఊరకుక్క అటుగా వచ్చిందిట. దాన్ని అదిలిద్దామని పెళ్లివారిలో ఒకడు ఓ రాయితో దాన్ని కొట్టాడుట. దానికి అభ్యంతరం చెప్పాడు మరొకడు. కొందరటు, మరికొందరిటు చేరి కొట్లాటకి దిగారు. చినికి చినికి గాలివానై బారాతీలలో చాలామంది కత్తులు, కఠారులతో సహా కొట్టుకున్నారుట. ఆ దొమ్మీలో తీవ్రంగా గాయపడి కొందరు ఆస్పత్రి పాలైతే పదకొండుమందిని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకుపోయారు. వాళ్లల్లో పెళ్ళికూతురు అన్న కూడా ఉన్నాట్ట.

-తటవర్తి